క్లుప్తంగా

ప్రమాదకర మలుపు


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు మలుపు

పూసపాటిరేగ: మండలంలోని లంకలపల్లి పాలెం ఆర్అండ్బీ రహదారిలో ఉన్న కల్వర్టు మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టు వెడల్పు తక్కువగా ఉండడం, అక్కడే మలుపు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అవనాపు దంపతులకు ఘన స్వాగతం


అభివాదం చేస్తున్న అవనాపు దంపతులు

విజయనగరం: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ సమక్షంలో ఈనెల 26న జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుని ఆదివారం విజయనగరం వచ్చిన అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అవనాపు భావన దంపతులకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. నగరంలోని వై జంక్షన్ వద్ద నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, జన సైనికులు, వీర మహిళలు స్వాగతం పలుకుతూ, జై అవనాపు అంటూ నినాదాలు చేశారు. విక్రమ్ యువసేన సుమారు వెయ్యి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. స్వాగతం పలికిన వారిలో జనసేన సీనియర్ నాయకుడు గురాన అయ్యలున్నారు.

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: ఎక్సైజ్ శాఖ సీఐగా ఎం. వెంకటరమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయన్ను అభినందించారు. వెంకటరమణ సాలూరు నుంచి నెల్లిమర్లకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా పనిచేసిన టి. తేజోవెంకట్కుమార్కు యలమంచిలి బదిలీ అయ్యింది.

ఆలోచింపజేసిన టెక్నో ఫెస్ట్


విద్యార్థుల ప్రాజెక్టులను తిలకిస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకటరమణ, కరెస్పాండెంట్ పాకలపాటి సన్యాసిరాజు, తదితరులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని పీఎస్ఆర్ (పువ్వాడ) టెక్నో స్కూల్లో ఆదివారం నిర్వహించిన టెక్నో ఫెస్ట్ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఈఓ వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. కరెస్పాండెంట్ పాకలపాటి సన్యాసిరాజు మాట్లాడుతూ, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి ప్రాజెక్టులు దోహదపడతాయన్నారు. ఎంఈఓ ప్రసాదరాజు మాట్లాడుతూ, భవిష్యత్లో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే, ప్రతి విద్యార్థీ ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: ప్రపంచ హృదయ(గుండె) దినోత్సవం సందర్భంగా మదర్ థెరీసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. విజయనగరం పట్టణంలోని అయ్యన్నపేట జంక్షన్లో ఉన్న మదర్ థెరీసా కిడ్స్ స్కూల్లో సేవా సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాకుళం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రవి కుమార్ మాట్లాడుతూ, మన శరీరంలో ముఖ్య భాగమైన గుండెను కాపాడుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తగిన శారీరక వ్యాయామం చేస్తూ ఒత్తిడి లేకుండా జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న 'సహాయ స్ఫూర్తి ఫౌండేషన్' అధ్యక్షుడు సాయికుమార్, డాక్టర్ రవికుమార్లను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘ గౌరవాధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, ఎన్వీఎస్ బ్లడ్బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, సంఘ సభ్యులు శ్రావణి, కీర్తన, తనీష్, శివదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులకు ససేమిరా..

- ఏళ్లుగా చెల్లించని వివిధ ప్రభుత్వ శాఖలు
- స్థానిక సంస్థల ప్రగతి పనులపై ప్రభావం


నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భవనాల ఆస్తి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఏళ్లుగా చెల్లించకపోవడంతో రూ. కోట్లకు చేరి గుదిబండగా మారాయి. ఈ పరిస్థితి స్థానిక ప్రగతి, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్కు సంబంధించి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల విషయంలో ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు రూ.32.31 కోట్ల వరకు బకాయి పడ్డాయి. ఇందులో ఏడాదికి పది శాతం కూడా వసూలు కావడం లేదు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, కొందరు వ్యాపారులు సైతం బకాయిలు ఉన్నారు. ఈ వ్యవహారం ఈ ప్రాంత అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

సామాన్యుల పైనే ప్రభావం....

పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగం, కుళాయి కనెక్షన్ నిలిపివేయడం వంటి చర్యలు తీసుకునే సిబ్బంది... భారీగా బకాయి పడిన వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను పట్టించుకోవడం లేదు. ఫలితంగా రూ. కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి 149 అసెస్మెంట్లపై రూ. 32 కోట్ల మేర పన్నులు రావాల్సి ఉంది. రూ. కోట్లలో బకాయిలు ఉండగా.. కొన్ని శాఖలు అడపాదడపా రూ. లక్షలు జమ చేసి మిన్నకుంటున్నాయి. దీనిపై విజయనగరం కార్పొరేషన్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు వివరణ కోరగా.. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు ఉన్న మాట వాస్తవమే. వాటికి సంబంధించి పలుమార్లు నోటీసులు ఇచ్చాం. స్పందన తక్కువగానే ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వసూళ్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్సీ బరిలో పీఆర్టీయూ అభ్యర్థిగా 'గాదె'


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు

విజయనగరం అర్బన్: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ మిత్ర సంఘాల అభ్యర్థిగా డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు బరిలో నిలవనున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల పీఆర్టీయూ సదస్సులో ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య మాట్లాడుతూ.. జూలైలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గాదె శ్రీనివాసులనాయుడు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలిపారు. ఆయన గెలుపే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహానికి సంబంధించిన ప్రత్యేక సమావేశాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాలకు సేవ చేయడానికి మళ్లీ పోటీ చేస్తున్నానని అన్నారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు వి.కరుణానిధిమూర్తి, డి.గోపీనాథ్, డైరీ అప్పారావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్చార్జి బి.శివప్రసాద్, మూడు జిల్లాల మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుండెను పరిరక్షించుకోవాలి

- కార్డియాలజిస్ట్ శరత్కుమార్ పాత్రో


రోగి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న కార్డియాలజిస్ట్ శరత్కుమార్ పాత్రో

విజయనగరం ఫోర్ట్: గుండెను పరిరక్షించుకోవాలని కార్డియాలజిస్ట్ శరత్కుమార్ పాత్రో అన్నారు. ప్రపంచ గుండె పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక తిరుమల ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది రోగులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ వ్యాయమం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా గుండె జబ్బులు బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్, ఆస్పత్రి సెంటర్ హెడ్ ఎన్. మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం రేపు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని బాండావీధిలోని కామాక్షమ్మ తల్లి గుడి వద్ద అక్టోబర్ 1వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘాల జేఏసీ కన్వీనర్ కోసూరి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల మెడికవర్ ఆస్పత్రి, విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల జేఏసీ సంయుక్తంగా శిబిరం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం కొనసాగుతుందని, రోగులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి ఇంటిలో సౌర విద్యుత్ వెలుగులు

విజయనగరం: ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ వెలుగులు విరజిమ్మాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. విజయనగరం వ్యాప్తంగా అత్యధిక మంది వినియోగదారులు సూర్యఘర్ పథకంలో చేరి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ చైర్మన్గా కార్పొరేషన్ కమిషనర్ మెంబర్గా, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కన్వీనర్గా జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెలకు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించే వినియోగదారులను చైతన్య పరిచి సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పథకం ద్వారా 1కేవీ సామర్థ్యం గల రూఫ్టాప్కు రూ. 30 వేలు, 2 కేవీ రూఫ్టాప్కు రూ.60 వేలు, 3 కేవీ రూఫ్టాప్కు రూ. 78 వేలు చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

కోనాడలో భూగర్భ జలాలు ఉప్పమయం


చంపావతి ఉప్పుటేరులో చేరుతున్న సముద్రపు నీరు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామ సమీపంలో ఉన్న చంపావతి నది పరీవాహక ప్రాంతంలో గల ఉప్పుటేరులోకి సముద్రం నీరు కలవడంతో తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్ల నుంచి వచ్చే నీరు ఉప్పుగా మారుతోంది. దీంతో మూడు గ్రామాలు ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. బొడ్డుగురయ్యపేట, బొడ్డువెంకటేశుపేట, కోనాడ గ్రామాలలో భూగర్భజలాలు ఉప్పుగా మారాయి. చంపావతినది కలిసే చోట గ్రోయిన్ కట్టినట్లయితే సముద్రపు నీరు రాకుండా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కోనాడ పరిసర ప్రాంతాలలో ఉన్న సుమారు వంద బోర్ల నుంచి ఉప్పునీరు వస్తుండడంతో పంటలు పండించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గ్రోయిన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఎం. రాధిక మాట్లాడుతూ, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అన్యాయంపై పోరాడుదాం..


వాల్పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వాజీ కేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్: సహనానికి మారుపేరుగా నిలిచే మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాడుదామని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 30న ఉదయం 9 గంటలకు కోట జంక్షన్ వద్ద నుంచి మహిళా గర్జన పేరుతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్పోస్టర్లను చానల్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాల్గొంటారన్నారు. సమావేశంలో మహిళా గర్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధిక వినియోగం అనర్థమే..!

- పురుగు మందుల పిచికారీలో అప్రమత్తం
- చీడపీడలకు అనుగుణంగా మందుల వినియోగం
- వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి


పూసపాటిరేగ గుండం చెరువు సమీపంలో వరి సాగు

పూసపాటిరేగ: సీజన్కు అనుగుణంగా పంటలకు చీడపీడలు, తెగుళ్లు సోకుతాయి. పైరులో పురుగులు, తెగుళ్లు కనిపించగానే రైతులు ఇష్టానుసారంగా రసాయన మందులు పిచికారీ చేసేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతున్నాయి. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులు వినియోగించాలి. పంటలను ఆశించే పురుగుల నివారణకు తమ మందులనే వాడాలని కంపెనీలు విపరీతంగా ప్రచారం చేస్తుండడంతో రైతులు ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేస్తున్నారు. దీనివల్ల ఎటువంటి ఫలితం ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అలాగే దుకాణదారులు ఏ మందు ఇస్తే దాన్ని వాడడం రైతులకు అలవాటుగా మారింది. అయితే ఇలాంటి చర్యలు రైతులకు నష్టాన్ని కలిగిస్తాయని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

గుర్తింపు పొందిన కంపెనీ మందులనే వాడాలి ..

గుర్తింపు పొందిన కంపెనీ మందులనే వాడాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. మందు పిచికారీ చేయడానికి ద్రావణాన్ని డ్రమ్ము లేదా బకెట్లో కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకోవాలి. మందును నీటిలో కలిపినప్పుడు రక్షణగా చేతులకు గ్లౌజులతో పాటు రక్షణ దుస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. శరీరంపై గాయాలు ఉన్నా మందులను పిచికారీ చేయకూడదు. పిచికారీ తర్వాత రెండు, మూడు సార్లు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. పశువుల మేత కోసం ఉంచిన పైర్లలో మందులు వినియోగించకూడదు. కల్తీ మందులు అస్సలు వాడకూడదు.

మోతాదు మేరకే..

వ్యవసాయ అధికారులు సూచనల మేరకే పురుగు మందులు వాడాలి. మందు తక్కువ వినియోగిస్తే పురుగులు చావవు. ఎక్కువ వినియోగిస్తే శత్రు పురుగులతో పాటు మిత్ర పురుగులు నశిస్తాయి. తెగుళ్లు ఆశించిన వెంటనే వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు వినియోగిస్తే ఫలితం ఉంటుంది.

– కొల్లి నీలిమ, మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

సిరిమాను చెట్టుకు పూజలు


హుకుంపేటలో సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి జాతరలో సిరిమానుగా రూపుదిద్దుకోనున్న చెట్టుకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నాలుగైదు రోజుల్లో సిరిమాను ప్రక్రియ పూర్తిచేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో పైడితల్లి..

సిరులతల్లి పైడితల్లి ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా తమ అభిమాన నేతలకు పాలాభిషేకాలు చేస్తుంటారు. పదవిలో లేనప్పుడు కూడా ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న ఏకైక నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి. ఐదేళ్ల తన హయాంలో అర్హులందరికీ నిరాటంకంగా సంక్షేమ పథకాలు అందించి, నిరుపేదల గుండెల్లో ఓ మంచి ప్రజా నేతగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల మండలంలోని దన్నానపేటలో గణనాథుడి అనుపోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే తమను అన్నివిధాలా ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి చిత్రపటానికి కూడా క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్థానిక యువత జగన్ పాటలకు కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు.

శిథిలావస్థకు చేరుకున్న ప్లాట్ఫారాలు


ముక్కాంలో తీరంలో అలల ధాటికి దెబ్బతిన్న ప్లాట్ఫారం

- ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు


శిథిలావస్థకు చేరుకున్న ప్లాట్ఫారం


ఇసుకలో ఆరబెట్టిన చేపలు

భోగాపురం: సముద్రతీర గ్రామాల్లో మత్స్యకారుల ప్రయోజనార్థం రూ. లక్షల వ్యయంతో నిర్మించిన ప్లాట్ఫారాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉపాధి హామీ నిధులతో నిర్మించిన ప్లాట్ఫారాలు సాగర తీరానికి ఆనుకుని ఉండడంతో అలల ధాటికి కొట్టుకుపోగా, మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం, చింతపల్లి, బర్రిపేట, తదితర సముద్రతీర ప్రాంతాల్లో మత్స్యకారులు పడవలు, మరబోట్లతో సముద్రంలో వేట సాగిస్తున్నారు. తీరానికి తీసుకువచ్చిన చేపలను విక్రయించగా.. మిగిలినవి నిల్వ చేస్తారు. వీటిని ఇసుక తిన్నెలపై అరబెడతారు. దీనివల్ల నాణ్యత లోపించి చేపలు పాడవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏడేళ్ల కిందట లక్షల రూపాయలు వెచ్చించి చేపల ఆరబోతకు ప్లాట్ఫారాలను నిర్మించారు. ఇవి మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. వాటిలో కొన్ని అలల ధాటికి దెబ్బతిన్నాయి. మరి కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చేపలు అరబెట్టుకునేందుకు మత్స్యకారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దెబ్బతిన్న, శిథిలావస్థకు చేరుకున్న ప్లాట్ఫారాలను తొలగించి కొత్త ప్లాట్ఫారాలను నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు. దీనిపై ఎఫ్డీఓ చాందిని స్పందిస్తూ, సముద్రతీరానికి సమీపంలో ఉన్నవి దెబ్బతింటున్నాయన్నారు. ఇకపై ఒడ్డుకు దూరంగా ఎక్కువ కాలం మన్నేలా ప్లాట్ఫారాల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తామని చెప్పారు.